ఇష్టారాజ్యంగా పార్కింగ్



చైతన్యనగర్ 60 అడుగుల రోడ్డులో ద్విచక్ర వాహనాల పార్కింగ్

- ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్లపై నిబంధనలు మీరి వాహనాల నిలిపివేత
- రోడ్ల వెంబడి బారులు తీరుతున్న వాహనాలు
- రాకపోకలకు జనం తంటాలు
- దృష్టి సారించని ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్లపై వాహనాల రాంగ్ పార్కింగ్ పెరుగుతోంది. ఇష్టారాజ్యంగా వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. రోడ్లపై అక్రమ పార్కింగ్‌తో రాకపోకలకు ఇతర వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాహనాలు కాలనీ రోడ్లపై వాహనాలు నిలిపి వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని నివాసులు చెబుతున్నారు. రాంగ్ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడా రోడ్డు ఖాళీగా ఉంటే అక్కడే వాహనాలు నిలిపి వెళ్లిపోతున్నారు.

ప్రైవేట్ వాహనాల రాంగ్ పార్కింగ్

జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదురుగా రోడ్డుపై వరుసగా వాహనాలను రాంగ్ పార్కింగ్ చేస్తున్నారు. ఈ మార్గంలో అంబులెన్స్ వంటి వాహనాలు రావడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. 15వ వార్డు హెచ్‌బీ కాలనీ నుంచి వెంకోజీపాలెం వెళ్లే ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడ ప్రైవేట్ వాహనాలను, టాటా వ్యాన్‌లు, ఆటోలు, వ్యాన్‌లు అక్రమంగా నిలుపుతున్నారు. దీంతో ఈ రోడ్డుపై ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

సర్వీస్ రోడ్డు నిండా వాహనాలే..

పిఠాపురం కాలనీ కూరగాయల మార్కెట్ నుంచి ఇటు మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్‌ఇంటి వైపు వచ్చే సర్వీస్ రోడ్డు ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఈ రోడ్డుపై కూరగాయల మార్కెట్ చివరి వరకు వాహనాలు నిలిపి వదిలేస్తున్నారు. దీంతో పిఠాపురం కాలనీవాసులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే రహదారిలో కొత్తగా ఓ ప్రైవేట్ భవనం నిర్మిస్తున్నారు. దాని నిర్మాణ సామగ్రితోపాటు కాంక్రీట్ మిక్సింగ్ యంత్రాలను రోడ్డుపైనే పార్క్‌చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు.



ఇసుకతోట ఆరోగ్య కేంద్రం రోడ్డులో నిలిపిన వాహనాలు

రోడ్డుకిరువైపులా ఇష్టానుసారంగా..

జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్ కాలనీ 60 అడుగుల రోడ్డు అక్రమ పార్కింగ్‌కు నిలయంగా మారింది. ఈ రోడ్డుకు ఇరువైపులా కార్లు, లారీలు, వ్యాన్‌లు, ద్విచక్ర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్క్‌చేస్తున్నారు. ఈ మార్గం మీదుగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కాలనీ రోడ్లపై రాత్రి వేళల్లో ఆటోలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. ఆ సమయంలో కాలనీలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

సమస్యను పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

పిఠాపురం కాలనీలోని కూరగాయల మార్కెట్ నుంచి మలేరియా కార్యాలయం వరకు గల సర్వీసు రోడ్డు, 16వ వార్డు ఇసుకతోట ఆరోగ్య కేంద్రం రోడ్డులో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే లారీలు, ప్రైవేట్ బస్సులు, ఏటీఎం క్యాష్ ఫిల్లింగ్ వాహనాలు, ఆటోలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. వీటితోపాటు ఇదే రోడ్డులోని లక్కీ పార్సిల్ సర్వీస్ కంపెనీకి చెందిన భారీ లారీలను నిలుపుతున్నారు. దీంతో సర్వీసు రోడ్డుపై రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలను పార్క్‌చేయవద్దని వాటి చోదకులకు కాలనీవాసులు ఎన్ని సార్లు చెప్పినా.. పట్టించుకోవడం లేదు. ఈ సమస్యను ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులు దృష్టి సారించి, ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్లుపై వాహనాల రాంగ్ పార్కింగ్‌ను అరికట్టాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

ఆకతాయిలకు అడ్డాగా..

ఆయా కాలనీల్లో అక్రమ పార్కింగ్ చేసిన వాహనాల మాటున ఆకతాయిలు చేరి పేట్రేగిపోతున్నారు. చీకటి పడితే చాలు మందుబాబులు రోడ్లపై చిందులేస్తున్నారు. అటుగా వెళ్లే వారితో వాగ్వాదాలకు దిగుతున్నారు. దీంతో ఒంటరిగా ఆ రోడ్లపై వెళ్లాలంటే స్థానికులు, మహిళలు భయపడుతున్నారు.



పిఠాపురం కాలనీలో పార్క్‌చేసి వదిలేసిన వాహనాలు



మద్దిలపాలెం మెయిన్ రోడ్డుపై భారీ వాహనాల పార్కింగ్



పిఠాపురం కాలనీ మలేరియా కార్యాలయం వద్ద పార్క్‌చేసిన లారీ, వ్యాన్‌లు, కార్లు

క్లుప్తంగా

నేడు కళాభారతిలో నాట్య పురస్కారాల ప్రదానం

మద్దిలపాలెం: సాయిసురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నృత్యకారులకు నాట్య పురస్కారాలు ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు రేఖ అట్లాడి, సాయి, సురేఖ అట్లాడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంప్రదాయ నాట్యం మొదలు పెట్టి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన నృత్యకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నాట్య ప్రదర్శనలు ప్రారంభమవుతాయని, అందరూ ఆహ్వానితులేనని చెప్పారు.

పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధులను గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: పిల్లల్లో పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను తొందరగా గుర్తించి, సరైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లా స్థాయి వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే సమస్యలను గుర్తించి, వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతీ చిన్నారికి సమగ్ర ఆరోగ్య పరీక్షలను తగిన మార్గదర్శకాలు పాటిస్తూ అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.హారిక, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ వి.సంధ్యారాణి, ఇ.శాంతిప్రియ పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో వ్యాధులు దూరం

ఏయూక్యాంపస్: గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను నివారించడానికి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం ఎంతో కీలకమని మాక్స్ హెల్త్‌కేర్ డైటెటిక్స్ విభాగాధిపతి రితికా సమద్దర్ అన్నారు. బీచ్ రోడ్డులో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమతుల ఆహారాన్ని తీసుకోవడం అవసరమని తెలిపారు. బాదం, ఓట్స్, తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటివి ఆహారంతో తప్పనిసరిగా ఉండాలన్నారు. తద్వార కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం వీలవుతుందని చెప్పారు. తృణధాన్యాలు, ఓట్స్ హృదయ సంబంధ వ్యాధులను నివారిస్తాయన్నారు.

జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి



డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విజయలక్ష్మి

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై ఆమె వచ్చారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తిని మర్యాదపూర్వకంగా విజయలక్ష్మి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గిరి ప్రదక్షిణ పనులు ప్రారంభం



ఎంఎంటీసీ కాలనీ ప్రధాన రహదారిలో డివైడర్‌ను పునరుద్ధరిస్తున్న కార్మికులు

మద్దిలపాలెం: జూలైలో జరగనున్న సింహచలం గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు భక్తులు ప్రదక్షిణ చేసే ప్రాంతాల సుందరీకరణ పనులను శుక్రవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రారంభించారు. 15వ వార్డు హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీలోని ప్రధాన రహదారి మధ్యలో విరిగిన డివైడర్‌ను కార్మికులు పునరుద్ధరించారు. జీవీఎంసీ విద్యుత్ దీపాల లైన్‌మెన్ శ్రీను పర్యవేక్షణలో ఈ మార్గంలో వెలగని విద్యుత్ దీపాలను బాగుచేశారు. గిరి ప్రదక్షిణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జీవీఎంసీ విభాగాధికారులు తగు చర్యలు చేపడుతున్నారు.

కంటిపై థైరాయిడ్ తీవ్ర ప్రభావం

ఆరిలోవ: థైరాయిడ్ వ్యాధి కంటిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ మద్దీ లావణ్య అన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో కంటి సమస్యలపై వెళ్లే వారికి శుక్రవారం ఆమె థైరాయిడ్‌పై అవగాహన కల్పించారు. థైరాయిడ్ వ్యాధి ఉన్నవారు శరీరం బరువు కోల్పోవడం, జుట్టు రాలడం, హార్మోనులు అసమతుల్యత తదితర సమస్యలతో బాధపడటంతోపాటు కంటిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. థైరాయిడ్ గ్రంధులు సరిగా పనిచేయని వారిలో కంటి రుగ్మతగా మారుతుందన్నారు. దీనివల్ల కంటి రూపం, పనితీరులో మార్పులు వస్తాయన్నారు. ఈ వ్యాధి వల్ల శరీర రోగ నిరోధక వ్యవస్థ పక్కదారి పట్టి కళ్ల చుట్టూ ఉన్న కొవ్వు చేరడం, కండరాలపై ప్రభావం చూపి ఉబ్బిపోవడం, కళ్లు మూసుకుపోవడం, కళ్ల చుట్టూ అసౌకర్యం, దృష్టి లోపం వస్తాయని వివరించారు. దీనికి సంబంధించిన శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ లావణ్య తెలిపారు. దీనికి ప్రారంభంలోనే చికిత్స పొందగలిగితే మంచి ఫలితం కలుగుతుందన్నారు.

నీటి సరఫరా సిబ్బంది సమ్మె బాట



ఆరిలోవ నీటి సరఫరా కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: సమస్యల పరిష్కారం కోసం జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె బాట పట్టారు. జీవీఎంసీ జోన్-2 పరిధి ఆరిలోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది శుక్రవారం నీటి సరఫరా నిలిపేసి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తమకు పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించబోమని హెచ్చరించారు. దీంతో శుక్రవారం నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఎక్కడా కుళాయిలు రావడం, నీటి ట్యాంకర్లు జాడ కనపించలేదు. దీంతో స్థానికులు నీటికి ఇబ్బంది పడ్డారు. ఆరిలోవ, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక, తోటగరువు, బాలాజీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్ తదితర ప్రాంతాల్లో తాగునీరు, వాడుక నీటి కోసం జనం కటకటలాడారు.

రైతుబజార్లలో తనిఖీలు



ఎంవీపీ రైతుబజార్‌లో స్టాళ్లు తనిఖీ చేస్తున్న డీడీ శ్రీనివాస కిరణ్

ఎంవీపీకాలనీ: జిల్లా మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస కిరణ్ శుక్రవారం ఎంవీపీ కాలనీ, సీతమ్మధార రైతుబజార్లను సందర్శించి, తనిఖీలు చేశారు. బజార్ స్టాళ్లలో కార్డుదారులు ఉన్నారా లేదని అని ఆరా తీశారు. ప్రతి రైతు గుర్తింపు కార్డు పెట్టుకోవాలని సూచించారు. ఎంవీపీ రైతుబజార్‌లో టమోటా, ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించారు. బజార్‌ల పరిశుభ్రతపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. బజార్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా రైతులు, వినియోగదారులకు అవగాహన పెంచాలని సూచించారు. డీడీ వెంట ఎంవీపీ రైతు బజార్ ఈవో వరహాలు ఉన్నారు.

యోగాంధ్రలో ఆర్టీసీ సేవలకు ప్రశంసలు

మద్దిలపాలెం: విశాఖ బీచ్ రోడ్డు వేదికగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజా రవాణ శాఖ నుంచి అందించిన ఉత్తమ సేవలను ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మద్దిలపాలెం ఆర్టీసీ బస్ డిపో వద్ద గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. యోగాంధ్ర విధుల్లో పాల్గొన్న అందరినీ ఆయన అభినందించారు. వారికి యోగా టీ షర్ట్‌లు అందజేశారు. ప్రతి ఒక్కరూ విధిగా యోగా చేయాలని సూచించారు. యోగా ద్వారా ఒత్తిడి ఉపసమనంతోపాటు ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో భాగస్వాములు కావడం గొప్ప విషమయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేసి ప్రయాణికులకు దగ్గరవ్వాలని, సిబ్బంది ప్రవర్తన మరింత మెరుగుపరచుకొని సమయపాలన పాటించాలని సూచించారు. జూలైలో జరగబోయే సింహాచలం గిరి ప్రదక్షిణకు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో మేనేజర్ కె..గంగాధర్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీ రామకృష్ణ, స్టోర్స్ ఇంజినీర్ అప్పారావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ సిబ్బందికి యోగా టీ షర్ట్‌లు అందిస్తున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

అంతరిక్ష సాంకేతికతలో ఆవిష్కరణలు అవసరం

మద్దిలపాలెం: ఢిల్లీలో జరిగిన ఇండియన్ స్పేస్ కాంగ్రెస్ సదస్సులో తారామండల్ సీఈవో వినీల్ జడ్సన్ పాల్గొని ప్రసంగించారు. అంతరిక్ష సాంకేతికతలో ఆవిష్కరణల గురించి ఉపన్యసించారు. అంతరిక్ష సాంకేతికతలు, సుస్థిర అంతరిక్ష కక్ష్యలు అవసరమన్నారు. 'ప్రపంచ భాగస్వామ్యం వైపు భారతదేశ ప్రయాణం' అనే నిర్ధిష్ట అంశంపై నిపుణుల ప్యానెల్‌లో సభ్యుడిగా వినీల్ పాల్గొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు ఐదుగురు సహ వ్యవస్థాపకుల బృందం స్థాపించిన స్పేస్ టెక్ స్టార్టప్ సీఈవోగా వినీల్ తారామండల్ లక్ష్యాలు, భవిష్యత్ ప్రగతిని వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ పసుమర్తి మల్లికార్జునరావు స్పేస్ టెక్ స్టార్టప్ తారామండల్‌కు మార్గదర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



ఇండియన్ స్పేస్ కాంగ్రెస్ సదస్సులో పాల్గొన్న తారామండల్ సీఈవో వినీల్ జడ్సన్

'ఎంఎస్‌ఎంఈ సేవలో చార్టర్డ్ అకౌంటెట్లు'



ఐసీఏఐ-ఎంఎస్‌ఎంఈ మహోత్సవంలో పాల్గొన్న సీఏలు

మద్దిలపాలెం: మద్దిలపాలెం పిఠాపురం కాలనీలోని ఐసీఏఐ భవన్‌లో ఐసీఏఐ ఎంఎస్‌ఎంఈ అండ్ స్టార్టప్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఏఐ ఎంఎస్‌ఎంఈ చైర్మన్, సీఏ శ్రీధర్ మాట్లాడుతూ ×ఒక రోజు ఎంఎస్‌ఎంఈ కోసం.. ఎంఎస్‌ఎంఈ సేవలో చార్టర్డ్ అకౌంటెట్లు¥ అనే థీమ్‌తో ఐసీఏఐ ఎంఎస్‌ఎంఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సీఏ రామునాయుడు, పలువురు సీఏలు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ హోమ్‌లో అన్నదానం



రెడ్‌క్రాస్ హోమ్‌లో ఆహారం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, ముచ్చల లక్ష్మి



కార్పొరేటర్ ముచ్చల లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాగితాల వారి కుటుంబం

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి జన్మదినం సందర్భంగా శుక్రవారం పెదవాల్తేరు రెడ్‌క్రాస్ హోమ్‌లో అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని ఆశ్రయులకు ఆహారం వడ్డించారు. అనంతరం కేక్ కట్‌చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- కాగితాల వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్, కాగితాల వారి సంఘం పెద్దలు, కుటుంబ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం డిపో మేనేజర్‌కు బదిలీ

మద్దిలపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్.అరుణకుమారి విజయనగరం డిపోకు బదిలీ అయ్యారు. ఆరేళ్లుగా ఇక్కడ ఆమె విధులు నిర్వహించారు. డిపోలో తన మార్క్ సేవలను అందించారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి ప్రయాణికులతో చక్కని అనుబంధం ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇటు సిబ్బందిలో.. అటు ప్రయాణికుల్లో అరుణకుమారి మంచి పేరు సంపాదించుకున్నారు. డిపో ప్రగతికి ఆమె చేసిన కృషిని సిబ్బంది కొనియాడారు. డిపో నుంచి బస్సుల సమయపాలన విషయంలో కచ్చితంగా వ్యవహరించేవారు. ఆమె స్థానంలో పూర్తి స్థాయి డీఎంగా ఎవరినీ నియమించలేదు. తాత్కాలికంగా వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్‌కు అనదపు బాధ్యతలు అప్పగించారు.

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో కనకదుర్గ



అమ్మవారికి అభిషేకం చేస్తున్న మహిళలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీలోని కనకదుర్గ ఆలయంలో శుక్రవారం ఆషాడ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చందనాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు శర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు జరిపి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ



డైరెక్టర్ గిరిధర్‌తో పీజీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

ఎంవీపీకాలనీ: పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యా శాఖ నిర్వహించిన ఏపీ పీజీ సెట్-2025 ఫలితాల్లో ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో కళాశాలలో బయో టెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ కోర్సులు చేస్తున్న 34 మంది విద్యార్థులు వందలోపు ర్యాంకులు సాధించారని కళాశాల యాజమాన్య ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కె.మహేశ్వరి (18), ఎస్.నవ్య (18), ఎ.శర్వాణి (23), జి.రాకేష్ (23), పి.వినీత (32), కె.లక్ష్మీ దీప్తి (32), హారిక సుప్రియాంక (32), బి.హరికుమార్ (32), లాస్యరత్నం (57) ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల యూజీ కోర్సుల డైరెక్టర్ డి.గిరిధర్ తదితరులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశీలన గృహాల సందర్శన



పరిశీలన గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: విశాఖలో అబ్జర్వేషన్ హోమ్, స్పెషల్ హోమ్, బాలికల గృహాలను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి హోమ్‌ల్లో పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించారు. అక్కడి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు, విద్య, ఆరోగ్య, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. హోమ్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, వైద్య సేవల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.